ఎలక్షన్ వార్ 2023
అనుదినం... జనస్వరం
ఖమ్మం- భద్రాద్రి కొత్తగూడెం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
08 పేజీలు
గురువారం 26 అక్టోబర్ 2023
www.navatelangana.com

దేశానికి అత్యంత ప్రమాదకరంగా బీజేపీ

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

4లో...



బీజేపీ విధానాలతో దళితులపై పెరుగుతున్న దాడులు

8లో...

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు





ప్రత్యర్థి ఎవరైనా గెలుపు నాదే..!

- ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నా.. తోచిన సాయం చేశా..
- కేసీఆర్ పాలనలో రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ గా ఉంది
- ఉచిత కరెంట్, రైతుబంధు, దళిత బంధు కొనసాగిస్తాం..
- నియోజకవర్గంలో సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేశా..
- ఏ గ్రామం వెళ్లినా కందాలే మళ్ళీ కావాలంటారు..
- అందరిలాగా వాగ్దానం చేయను.. పని చేసి చూపిస్తా..
- పాలేరు బీఆర్ ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్ రెడ్డి

3లో...

నిస్వార్థ సేవకులు

మచ్చలేని నేతలు కుంజా బొజ్జి, సున్నం రాజయ్యలకు లాల్ సలాం..



- కడవరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడ్డ నాయకులు

నవతెలంగాణ-భద్రాచల రూరల్

ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం వస్తేనే వందల కోట్లు సంపాదించి ప్రజా క్షేమం కంటే వ్యక్తిగత స్వార్థాలకే మొదటి ప్రాధాన్యత ఇచ్చే రాజకీయ నాయకులు ఉన్న ఈ రోజుల్లో కడవరకు ప్రజల పక్షాన నిలబడి ప్రజా పోరాటాలే ఆయుధంగా మలిచి నిస్వార్థంగా ప్రజాసేవకే తమ జీవితాలను అంకితం చేసిన సున్నం రాజయ్య, కుంజ బొజ్జిలపై నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం.

1985 నుండి 1994 వరకు వరుసగా మూడుసార్లు భద్రాచలం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుపొంది తుది శ్వాస విడిచేంతవరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి కుంజ బొజ్జి ఆదర్శవంతమైన రాజకీయ నేతగా నిలిచారు. నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని శాసనసభ్యులందరికీ హైదరాబాదు జూబ్లీహిల్స్ లో ఇంటి ప్లాట్లు ఇచ్చే క్రమంలో భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న కుంజా బొజ్జి మాత్రం ప్రజల ఓట్లతో గెలిచిన ఆయన ఆ ప్రజల్లోనే ఉనాడె తప్ప హైదరాబాదులో ఇల్లు నాకెందుకు అని సున్నితంగా తిరస్కరించి ఆ రోజుల్లోనే లక్షలు విలువ చేసే ఇంటి ప్లాటును తిరస్కరించి తన చివరి రోజుల్లో సొంత ఇల్లు కూడా లేకుండా తన కూతురి ఇంటి వద్దే కాలం చేసిన నిస్వార్థ ప్రజా సేవకుడు కుంజా బొజ్జి. కుంజ బొజ్జి పోరాట వారసుడిగా ఉద్యమంలో కొచ్చిన సున్నం రాజయ్య సైతం మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఏ ఒక్క అవినీతి మచ్చ లేకుండా చివరి వరకు తన జీవితం ప్రజాసేవకే అంకితం చేశారు.



2014లో తొలి తెలంగాణ అసెంబ్లీకి భద్రాచలం నుండి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించిన సున్నం రాజయ్య ఎమ్మెల్యేల వేతనాలు పెంచాలని చర్చిస్తూ అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని నిరసిస్తూ పెంచాల్సింది ఎమ్మెల్యేల వేతనం కాదు కార్మికుల వేతనాలు పెంచిన తర్వాతే ఎమ్మెల్యేలు వేతనాలు గురించి ఆలోచించాలని అట్టి అసెంబ్లీ

మిగతా 3లో...

సీఎం సభను విజయవంతం చేయాలి



- రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

నవతెలంగాణ-కొత్తగూడెం

బీఆర్ఎస్ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కొత్తగూడెం పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నవంబర్ 5న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభ జయప్రదం చేయడం కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బందోబస్తు పటిష్టం

అక్రమ రవాణాపై నిఘా, కట్టుదిట్టం కేంద్ర బలగాల అధికారుల సమావేశంలో సీపీ



నవతెలంగాణ-ఖమ్మం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చూసేందుకు క్షేత్రస్థాయి నుంచి అన్ని చర్యలు తీసుకున్నట్లు పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లాకు చేరుకున్న ఐదు కంపెనీల సెంట్రల్ పోలీస్ ఫోర్సెస్ బలగాల అధికారులతో బందోబస్తులో బలగాల మోహరింపుపై పోలీస్ కమిషనర్ ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు జిల్లా పోలీసులకు అదనంగా కేంద్ర బలగాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంతరాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన 12 చెక్ పోస్టులతో పాటు జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, వెహికల్ చెకింగ్స్ వద్ద సీఆర్పీఎఫ్ సిబ్బంది కూడా డ్యూటీ నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నామని, ఆయా చెక్ పోస్ట్ ల ద్వారా మద్యం, డబ్బు అక్రమ రవాణా జరగకుండా నిఘా కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజల్లో చైతన్యం కల్పించడానికి కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మిగతా 3లో...

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఖమ్మం
గురువారం | అక్టోబర్ 26 2023 | www.navatelangana.com

చెన్నకేశవునికి కేజీ వెండి వస్తువులు వితరణ

నవతెలంగాణ-చింతకాని



చింతకాని చెన్నకేశవ స్వామి దేవాలయానికి కేజీ వెండి వస్తువులను వైరాకు చెందిన వీరపనేని బాలకృష్ణ సౌజన్య దంపతులు బుధవారం అందజేశారు దేవాలయంలో స్వామి వారి పూజకు నిత్యం వినియోగించే వస్తువులను అందజేసినట్లు దాతలు తెలిపారు. దేవాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, ఈవో రామకోటేశ్వరరావు, అర్చకులు పరిహారం శ్రీనివాసచార్యులకు ఈ వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ పొనుగోటి రత్నాకర్, కమిటీ సభ్యులు ఆకుల చంద్రయ్య, బండి తిరపయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు జలగనబోయిన కృష్ణ, దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

మట్టా రాగమయికి టికెట్ రావాలని పూజలు

నవతెలంగాణ- తల్లాడ

సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మట్టా రాగమయికి కేటాయించాలని కోరుతూ తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం నల్గొండ జిల్లా ఎర్రవరం గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తల్లాడ పట్టణ అధ్యక్షులు తగ్గుల నాగిరెడ్డి, నాయకులు మారేళ్ళ మల్లికార్జునరావు, పొన్నం కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తాళ్ల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నవతెలంగాణ- ఖమ్మం



బోడేపుడి రాజా జన్మదిన సందర్భంగా ఖమ్మం శ్రీనగర్ కాలనీ రోడ్ నెం 1లో బోడేపుడి ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియా పిల్లల కొరకు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని బోడేపుడి ట్రస్ట్ చైర్మన్ బోడేపుడి రాజా కలిసి చిన్నపిల్లల డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ ప్రారంభించారు. సుమారుగా 50 మంది రక్తదానం చేశారు. నిరుపేద మహిళలకు 500 మందికి చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోడేపుడి రాజాను మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పువ్వాల దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, చావా నారాయణ శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి నాలుగు కుటుంబాలు బుధవారం చేరినట్లు అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని తెలిపారు. స్థానిక సాయిబాబా కళ్యాణ మండపంలో నూతనంగా కాంగ్రెస్ లో చేరిన వారికి మల్లు నందిని కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు, జడ్పిటిసి మోదుగు సుధీర్‌బాబు, కలకోట సొసైటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావు, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఎర్రం శెట్టి సుబ్బారావు, భాగం శ్రీనివాసరావు, చిలక వెంకటేశ్వర్లు, నన్నకా లక్ష్మి, ఎంపీటీసీ పారా శ్రీదేవి పాల్గొన్నారు.

పత్తి క్వింటాకు రూ.15 వేల మద్దతు ధర ఇవ్వాలి

నవతెలంగాణ-కొణిజర్ల

పత్తి క్వింటాకు రూ.15 వేల మద్దతు ధర ఇవ్వాలి అని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎస్ కె ఖాసిం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి పటాన్ ఖాసీంఖాన్, బంటు లచ్చన్న, ఆంగోత్ భాష, చల్లా ఉపేందర్, గూగులోతు దస్రు, రొంటే గంగన్న, గడ్డం మంగపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నవతెలంగాణ-చింతకాని

ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిఆర్డిఓ విద్యా చందన సిబ్బందిని హెచ్చరించారు. మండల పరిధిలోని కొదుమూరు, లచ్చగూడెం, వందనం గ్రామాల్లో చేపట్టిన వన నర్సరీలు గ్రామాల్లో గతంలో నాటిన మొక్కలను ఆమె బుధవారం పరిశీలించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ హుస్సేన్. పంచాయతీ కార్యదర్శులు చారి శ్రీరామ్ మహేష్ ఉన్నారు

ముగిసిన దేవిశరన్నవరాత్రోత్సవాలు

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం నగరంలో వివిధ మండపాల్లో తొమ్మిది రోజుల పాటు సాగిన శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పూజలందుకున్న అమ్మ వారి విగ్రహాలతో భక్తులు శోభాయాత్ర నిర్వహించి మున్నేరు జలాశయాల్లో అమ్మవారి విగ్రహాలు నిమజ్జనం చేశారు. ఖమ్మం కాల్వొడ్డులోని మున్నేరు జలాశయం వద్ద కేఎంసి అధికారులు క్రేన్లు, గజఈతగాళ్లను నియమించారు.

ఓటుహక్కుపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం



ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. జిల్లాలో ఓటర్లను చైతన్యపరచడానికి ఏర్పాటు చేసిన ఓటరు చైతన్య రథాలను బుధవారం నూతన కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన సాంస్కృతిక సారథి కళాకారులను రెండు బృందాలుగా విభజించి, జిల్లా వ్యాప్తంగా ఓటరు అవగా హన, సి విజిల్ యాప్, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛ, న్యాయబద్ద ఎన్నికలపై ప్రజల్లో తమ ఆట పాట ద్వారా చైతన్యం కల్పించేలా ప్రణాళిక చేపట్టి, కార్యాచరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, స్వీప్ నోడల్ అధికారి శ్రీరామ్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ.శ్రీనివాస్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.ఏ.గౌస్, అదనపు పౌరసంబంధాల అధికారి వి.శ్రీనివాసరావు, సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చుల వివరాలను నమోదు చేయాలి : జిల్లా వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి విజయకుమారి

శాసనసభ సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు నమోదు చేయాలని జిల్లా వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి విజయకుమారి అన్నారు. బుధవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అకౌంటింగ్ టీం, ఎస్ఎస్‌టి, విఎస్‌టి, వీవీటీ టీమ్ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి విజయనిర్మల, స్టేట్ ఆడిట్ ఉప సంచాలకులు హుస్సేన్ నాయక్, స్వీప్ నోడల్ అధికారి శ్రీరామ్, నిఘా బృందాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి రాధాకృష్ణమూర్తి కుమారులను కలిసిన తుమ్మల

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

కమ్యూనిస్టు యోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యులు యలమంచిలి రాధాకృష్ణమూర్తి కుమారులు యలమంచిలి డాక్టర్ రవీంద్రనాథ్, రామకోటేశ్వరరావులను బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఖమ్మం అసెంబ్లీ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా వారి నివాసంకి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు.



పలు కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని నేలపట్ల గ్రామానికి చెందిన పలు కుటుంబాలు బుధవారం ఖమ్మంరూరల్ లోని రామలీల పంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి సంక్షేమంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.

బిఆర్ఎస్ పార్టీ లోనే ఉంటా: ముల్కురి శ్రీనివాస్ రెడ్డి..

మండలంలోని గైగోళ్ళపల్లి గ్రామానికి చెందిన ముల్కూరి శ్రీనివాస్ రెడ్డి తాను పార్టీ వీడుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని, బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, ఎంఎల్ఏ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం : ఏసీపీ

నవతెలంగాణ- ఖమ్మం

పోలీసు అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని ఖమ్మం నగర ఏసీపీ హరికృష్ణ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఖమ్మంలోని బుధవారం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. నగరంలో సర్దార్ పటేల్ స్టేడియం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సర్దార్ పటేల్ స్టేడియం నుండి జెడ్పీ సెంటర్, చెరువు బజార్, చర్చి కంపౌండ్ మీదుగా పోలీస్ కమిషనర్ కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా నగర ఏసీపీ మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపన కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పోలీసు అమరవీరుల ఆశయాల సాధన కోసం అంకిత భావంతో కృషి చేస్తున్నామన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు సమాజం శాంతియుతగా వర్ధిల్లుతున్నదన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, సిఐలు కుమారస్వామి, శ్రీహరి, శ్రీధర్, సతీష్, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు హెడ్ క్వార్టర్స్ పోలీస్ శిక్షణ కేంద్ర కార్యాలయంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పోలీస్ కమిషనర్ విష్ణు యస్.వారియర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై వియవంతం చేయాలని సూచించారు.

ఇది అభివృద్ధికి.. అహంకారానికి మధ్య యుద్ధం

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్

నవతెలంగాణ- ఖమ్మం/ఖమ్మంకార్పొరేషన్



వచ్చే ఎన్నికలు ఖమ్మం నగర అభివృద్ధికి... ఒక పెద్ద మనిషి అహంకారానికి మధ్య జరుగుతున్న యుద్ధమని ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. బుధవారం ఖమ్మం నగరం నెహ్రూ నగర్ నందు ప్రముఖ న్యాయవాది మల్లాది వాసుదేవరావు అధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వేస్తే పోలీసులను జీపుల ముందు పరిగెత్తిస్తా అంటు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. అప్పుడే అధికారం వచ్చేసినట్లు భావించడం వారి అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. మీకు పాలేరు టికెట్ ఇవ్వలేదని కేసీఅర్‌ని తీడతావా.. మీకు టికెట్ ఇస్తే మంచి ప్రభుత్వం.. ఇవ్వకుంటే కేసీఅర్ ప్రభుత్వం నిరంకుశ ప్రభుత్వమా..? గోదావరి జలాలతో పాలేరు ప్రజల కాళ్ళు కడుగుతా అన్న పెద్ద మనిషి ఖమ్మం ప్రజల కాళ్ళతో ఏం పనో మరి ఆయనకే తెలవాలన్నారు. అనంతరం వాసుదేవరావు పుట్టినరోజు సందర్భంగా వారికి పువ్వాడ అజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్, వెంకట్‌రెడ్డి, కార్యదర్శి ముత్తయ్య, హరిబాబు, కొండల్‌రావు, మేకల భిక్షమయ్య, వేములపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలోని బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఖానాపురం హవేలీ పరిధిలోని డివిజన్‌ల బూత్ లెవెల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ ఢిల్లీ నుండి గల్లీ దాకా ఏ సర్వే తీసుకున్నా బిఆర్ఎస్ పార్టీయే గెలుసుతుంది అని రిపోర్ట్ ఉంది అని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్ కొత్తపల్లి నీరజ, దండా జ్యోతి రెడ్డి, నాగండ్ల కోటి, కూరాకుల వలరాజ్, సుడా చైర్మన్ విజయ్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరి రావు, భీరెడ్డి నాగచంద్రారెడ్డి, వల్లభనేని రామారావు పాల్గొన్నారు.

డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్‌ని కలిసిన పువ్వాడ

ఖమ్మం నగరంలో త్రీ టౌన్ ప్రాంతంలోని డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్ నివాసానికి పువ్వాడ అజయ్‌కుమార్ వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. యలమంచిలి రవీంద్ర నాథ్‌కి శాలువా కప్పి సత్కరించారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు.

నవతెలంగాణ
ఖమ్మం
3
గురువారం | అక్టోబర్ 26 2023 | www.navatelangana.com

జోనల్ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

నవతెలంగాణ-వేంసూరు

బీఆర్ఎస్ భరణిపాడు జోనల్ కమిటీ అధ్యక్షులు మందపాటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మరొకసారి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యను గెలిపించుకుని గ్రామ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ ప్రచారంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు సొసైటీ అధ్యక్షులు కూరపాటి నాని వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామ శాఖ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మ వారి విగ్రహం వద్ద అన్నదానం

నవతెలంగాణ-కల్లూరు

పట్టణంలోని, మధిర రోడ్డులో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి విగ్రహం వద్ద పూజా కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు కొండూరు సుధాకర్ బుధవారం హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమానికి విరాళం ఇచ్చినటువంటి కాటేపల్లి కిరణ్ కుమార్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య కార్యదర్శి కాటేపల్లి కిరణ్ కుమార్, ధారా రామారావు, పాల్గొన్నారు.

అన్నదాన ప్రారంభించిన రాగమయ

పుల్లయ్య బంజర రోడ్డులో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి మండపంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకురాలు డాక్టర్ రాగమయ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రాగమయ శాలవుతో సన్మానించారు.

తండ్రి గెలుపు కోసం తనయుడు ప్రచారం

నవతెలంగాణ-మధిర

మధిర కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క విజయాన్ని కాంక్షిస్తూ భట్టి విక్రమార్క తనయుడు మల్లు సూర్య విక్రమ్ ఆదిత్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య విక్రమ్ ఆదిత్య మాట్లాడుతూ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో రంగా హనుమంతరావు, కర్నాటి రామారావు, అద్దంకి రవికుమార్, తలుపుల వెంకటేశ్వర్లు, వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



పోయి రావమ్మా కనకదుర్గమ్మ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

నవరాత్రులు పూర్తి చేసుకొని ఎంతో ఉత్సాహంగా కోలాటాలు, ఆటపాటలతో ఎంతో ఘనంగా కనకదుర్గమ్మను ఊరేగింపు చేశారు. మండల పరిధిలోని రాజాపురం గ్రామంలో గల మెదర్ బజార్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన కనక దుర్గమ్మను చివరి రోజు అయిన బుధవారం ఊరేగింపు చేసి గ్రామంలో గల రాముడు చెరువులో నిమజ్జనం చేశారు. మహిళలు, చిన్నారులు కులమతాలకు అతీతంగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పోయి రావమ్మా దుర్గమ్మ అంటూ నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సోమయ్య, వెంకటలక్ష్మి, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, లక్ష్మి, త్రివేణి, నందిని, సోని, రవి, రేణుక, సంధ్య, రూప, నరేష్, సతీష్, సత్యవతి, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యర్థి ఎవరైనా గెలుపు నాదే..!

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కూసుమంచి:

పాలేరులో ప్రత్యర్థి ఎవరైనా తన గెలుపును అడ్డుకునే శక్తి ఎవరికీ లేదని నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తానేంటో నియోజకవర్గ ప్రజలకు తెలుసు అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని తెలిపారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ గా ఉందన్నారు. అందరిలాగా వాగ్దానాలు చేయను.. పనిచేసే చూపిస్తానని చెప్పారు. 27వ తేదీన కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామ సమీపంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు కేసీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో సభా స్థలిలో ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కందాల మాట్లాడారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గ ప్రజలు తానేంటో చూశారని, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని, ఎవరు వచ్చి అడిగినా తోచిన సహాయం చేశానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ను ఒప్పించి రోడ్లు తెచ్చా .. గవర్నమెంట్ ఇంజినీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాలను నియోజకవర్గానికి తీసుకొచ్చానని తెలిపారు. మున్నేరు ప్రాంత ప్రజలు కరుణగిరి, జలగంనగర్ ప్రాంతంలో ముంపునకు గురికాకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టబోతున్నామని అన్నారు. పాలేరు పాత కాలువ, భక్తరామదాసు ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీరు అందించామన్నారు. 24 గంటలు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, రైతు బంధు, దళితబంధు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తున్నామని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ ద్వారా 15 లక్షల వరకు వైద్యం అందించడం, సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళలకు ప్రతి నెలా పెన్షన్ ఇచ్చే పథకం తెస్తున్నామన్నారు. ఆసరా పెన్షన్లను దశలవారీగా పెంచుతామన్నారు. పాలేరు నియోజకవర్గం లో తన గెలుపు ఖాయమని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని చెప్పారు.

ఎక్కడి నుంచో ఇక్కడకు రాలేదు..

తాను ఇక్కడి వాణ్ణని, అందరిలాగా ఎక్కడి నుంచో ఇక్కడకు రాలేదన్నారు. అనేకమంది దిగుమతి అభ్యర్థులు నియోజకవర్గంలో గెలవడం, ఆ తర్వాత పట్టించుకోకపోవడం చూస్తున్నామన్నారు. ఒకాయన పాలేరులో పోటీకోసమే కాంగ్రెస్ లో చేరుతున్నట్లు ప్రకటించారు.. సీతారామ ప్రాజెక్టు నీళ్లతో పాలేరు ప్రజల కాళ్లు కడుగుతానని మాటలు చెప్పారు.. ఆ తర్వాత ప్లేట్ ఫిరాయించి ఖమ్మం కు వెళ్లారని తుమ్మలకు చురకలు అంటించారు. ఈనెల 27న నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గ వ్యాప్తంగా 70 వేల మంది హాజరవుతారని ఉపేందర్ రెడ్డి తెలిపారు.

అధికారులపై తుమ్మల ఇష్టానుసారంగా మాటలు: ఎమ్మెల్సీ తాతా

తుమ్మల అధికారులను ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శలు గుప్పించారు. ఆయన కూడా చాలాకాలం మంత్రిగా చేశారని, అధికారులు వారి విధులు వారు నిర్వహిస్తారని తెలియదా? అని ప్రశ్నించారు. పోలీసులు కేసులు పెట్టి వేధించారని చెప్పడం అభ్యంతరకరమన్నారు. కేసులు పెట్టిన పోలీసులను బాధితుడి ఇంటి దగ్గరకు పిలిపించి క్షమాపణ చెప్పిస్తాని చెప్పి పోలీస్ శాఖ మనోస్థైర్యాన్ని దెబ్బతీయడం తగదని హితవు పలికారు. ఇలాంటి మాటలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెపుతారని తాతా హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కూసుమంచి ఎంపీపీ శ్రీను, ఖమ్మం రూరల్ మండల జడ్పీటీసీ వరప్రసాద్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు, కూసుమంచి మండల నాయకులు ఇంటూరి శేఖర్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు

మొదటి పేజీ తరువాయి

సమావేశంలో సైతం బైకాట్ చేసి తన వ్యక్తిగత గౌరవ వేతనం కంటే కార్మికుల జీవన ఉపాధి ముఖ్యమని చాటి చెప్పారు. తన సొంత ఊరైన విఆర్ పురం మండలం సున్నవారిగూడెంలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ఊరి చెరువుతో పాటు నివాస గృహాలు నిర్మించేందుకు 10 ఎకరాల తన సొంత భూమిని ప్రభుత్వానికి ఉచితంగా దానం ఇచ్చారు. అధికారం పదవి ఉంటే వందల ఎకరాలు కబ్జా చేయొచ్చు అన్న రాజకీయ నాయకులు ఆలోచనలకు భిన్నంగా సున్నం రాజయ్య తన సొంత భూమిని ప్రజల కోసం దానమిచ్చి ఈ ప్రాంత ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచారు. విభజన సమయంలో భద్రాచలం నియోజవర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేసి చావు చివరి వరకు వెళ్లి ఈ ప్రాంత ప్రజల కోసం నిలబడ్డారు. భద్రాచలం నియోజవర్గంలో విద్యా వైద్యం తో పాటు తాగు సాగు నీరును అందించేందుకు కుంజా బొజ్జి, సున్నం రాజయ్యలు చేసిన పోరాటం ఈ ప్రాంత ప్రజల మదిలో ఎప్పటికీ నిలిచి ఉంటుంది. మార్క్సిస్టు పార్టీ నిబంధనకు కట్టుబడి ఆడంబరాలకు పోకుండా సాధారణ జీవితాన్ని గడుపుతూ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే అంటే ఒక ప్రజా సేవకుడుగానే గుర్తింపు పొందిన సున్నం రాజయ్య కరోనాకాలంలో సైతం ప్రజలకు అందుబాటులో ఉంటూ తన ప్రాణాల కన్నా ప్రజా శ్రేయస్సు ముఖ్యమని భావించి కరోనా కాటికి బలయ్యారు. భద్రాచలం నియోజవర్గాన్ని సమగ్ర అభివృద్ధి చేసి చివరి వరకు సాధారణ జీవితాన్ని గడిపిన సున్నం రాజయ్య, కుంజా బొజ్జి వంటి నిస్వార్థ రాజకీయ నాయకులు ఇప్పుడు ఎంతైనా అవసరం ఉందని స్పష్టం అవుతుంది.

అభివృద్ధికి ఓటెయ్యండి : ఎన్నికల ప్రచారంలోఎమ్మెల్యే వనమా

పాల్వంచ : రంగురంగుల వేషాలతో ముఖాలకు రంగేసుకుని మనసులో ఒకటి పెట్టుకొని ప్రజల్లోకి కొన్ని పార్టీలు రాబోతున్నాయని పార్టీల నాయకులను మీ గ్రామాలకు వారు ఏం చేశారో అడుగుతూ నిలదీయాలని కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వనమా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రచారంలో భాగంగా బుధవారం కొత్తగూడెం నియోజకవర్గం పాల్వంచ మండలం లోని దంతల బోర, గంగాదేవి గుప్పు, బంజరగొండ, సంగం, దంతెల బోర ఎస్సీ కాలనీ, నారాయణరావుపేట, రేపల్లె, బొజ్జ తండా, నాగారం తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంతాల్లో జరిగిన సభల్లో వనమా మాట్లాడారు. అభివృద్ధిని చూసి ఓటేయాలన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత ప్రచార

నవతెలంగాణ-పెనుబల్లి

మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య గెలుపును కాంక్షిస్తూ బుధవారం కార్యకర్తలు గ్రామ గ్రామాన ప్రచారం మొదలుపెట్టారు. బీఆర్ఎస్ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటా పంచుతూ సండ్రకు ఓటు వేయాలంటూ ప్రచారం సాగిస్తున్నారు. పెనుబల్లి, ఆడవి మల్లెల, సూర్య బంజర్, కారాయి గూడెం, గౌరారం తో పాటు అన్ని పంచాయతీలలో ఇంటింటా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోటగిరి సుధాకర్ బాబు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య వినీల్, మండల ఉపాధ్యక్షురాలు నరుకుళ్ళ కస్తూరి, దొడ్డపనేని రవి, తాళ్లూరి శేఖర్ రావు, మందడపు అశోక్ కుమార్, జడ్పిటిసి చెక్కిలాల మోహన్రావు, భూక్య ప్రసాద్, తావు నాయక్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నేత దూల వెంకటేశ్వర్లుకు పరామర్శ

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కామ్రేడ్ దూల వెంకటేశ్వర్లు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పార్టీ మండల కమిటీ బుధవారం ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు, గోపాల్పేట సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు, సిఐటియు నాయకులు షేక్ మస్తాన్, సత్తెనపల్లి రాఘవులు ఉన్నారు.

అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న

నవతెలంగాణ-మధిర

మధిర మెయిన్ రోడ్ లోని విఘ్నేశ్వర స్వామి ఆలయంలో బుధవారం దాతలు ఆలయ కమిటీ మెంబర్ వలిశెట్టి శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి పుత్రిక స్వాతి వారి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మధిర వినాయక ఆలయ కమిటీ చైర్మన్ బాణాల శంకరాచారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవి శాస్త్రి, వలిశెట్టి శ్రీను, ఆదిలక్ష్మి, స్వాతి, యోగానందం, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

నవతెలంగాణ-కల్లూరు

పట్టణ పరిధిలోని 87, 88, 89, 90 పోలింగ్ బూత్ నెంబర్లలో కాంగ్రెస్ నాయకులు ప్రజలతో మమేకమై గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 హామీల గ్యారంటీ కార్డులను ప్రతి ఇంటికి అందజేసి, సొంత స్థలంలో ఇండ్లు కట్టుకొనే వారికి 5లక్షల రూపాయలతో పాటు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అభయ హస్తం ఆరు గ్యారంటీలను అమలుచేసి వచ్చే ఎన్నికలలో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పెద్దప్రోలు దుర్గాప్రసాద్, ఎస్సీ రాష్ట్ర డిపిటీ కన్వీనర్ కొండూరు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జిల్లెళ్ల కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కీసర శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు ఆఫ్రోజ్, చుక్కా, వీర్ల గోవిందరావు, చిన్న లక్ష్మయ్య, మల్లయ్య, రమణయ్య, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

పాలే నాగేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిధిలోని కొత్తలింగాల గ్రామానికి చెందిన పాలే నాగేశ్వరరావు కుటుంబాన్ని బుధవారం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రధాన అనుచరుడు, డీసీసీబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ పరామర్శించారు. ఇటీవల కాలంలో నాగేశ్వరరావు తల్లి మరియమ్మ స్వర్గస్తురాలు అయినారు. సమాచారం తెలుసుకున్న మల్లి బాబు యాదవ్ ఆ కుటుంబాన్ని పరామర్శించి, మనోధైర్యం కల్పించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్.కె ఫతే అహ్మద్, మాజీ ఎంపీటీసీ దొడ్డిగర్ల సుందరం, అజ్మీర పాపియ నాయక్, చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు పటిష్టం

మొదటి పేజీ తరువాయి

అలాగే జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక పోస్టులతో ముమ్మర తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ పూర్తయ్యే వరకు సీఆర్పీఎఫ్ బలగాలు విధులు నిర్వహించనున్నాయని తెలిపారు. సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా బందోబస్తు నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. ఈ సమావేశం అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు, సెంట్రల్ పోలీస్ ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
ఖమ్మం
గురువారం | అక్టోబర్ 26, 2023 | www.navatelangana.com

బ్యాడ్ 'టైమ్' స్టార్ట్ కావడంతోనే బే 'కారు' మాటలు...!

నవతెలంగాణ- ఖమ్మం

బీఆర్ఎస్ నేతల్లో వణుకు మొదలైంది...ఓడిపోతామనే భయంతో ఇక చేసేదేమి లేక లేనివి ఉన్నట్టుగా చిత్రీకరించి అసత్యపు ప్రచారాలకు కంకణం కట్టుకుందని. పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పొంగులేటి శీనన్న కుమార్తె వివాహం సందర్భంగా సుమారు ఐదు లక్షల మందికి వాచీలను కానుకగా ఇచ్చి రిసెప్షన్‌కు ఆహ్వానం పంపగా మిగిలిపోయిన వాచీలతో 'రాద్ధాంతానికి తెరలేపారని, ఎన్నికల సందర్భంగా ఏవో గిఫ్ట్‌లను పంచేందుకు ఎస్ఆర్ హెూమ్స్‌లో డంప్ చేసి పెట్టామంటూ కొంతమంది తప్పుడు సమాచారాన్ని ఎన్నికల అధికారులకు చేరవేశారని, ఇక సీన్లోకి వెళ్తే ఏడాదిన్నర క్రితం శీనన్న కుమార్తె వివాహం సందర్భంగా పంచగా మిగిలిపోయిన వాచీలు అధికారులకు దర్శనమిచ్చాయని, వాటిపై స్పష్టంగా ' నా కుమార్తె వివాహం సందర్భంగా ప్రేమతో మీ శీనన్న' అని రాసి ఉంది. ఇదే సందర్భంలో తగిన ఆధారాలతో సహా సంబంధిత అధికారులకు కూడా బిల్లులను చూపించడం జరిగిందని తెలిపారు. మిగిలిపోయి ఎక్కడో ఓ స్టోర్ రూమ్ లో ఉన్న వాచీలపై రాద్ధాంతాన్ని చేస్తున్న తీరును గమనిస్తే బీఆర్ఎస్‌కు బ్యాడ్ 'టైమ్' స్టార్ట్ కావడంతోనే బే 'కారు' మాటలకు తెరలేపారనడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు.

దేశానికి అత్యంత ప్రమాదకరంగా బీజేపీ

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

నవతెలంగాణ - బోనకల్



కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశానికి అత్యంత ప్రమాదకరంగా మారిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వీరుల బాణంలో పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం నోముల పుల్లయ్య అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుందని, ఆ ప్రయత్నాలను వామపక్షాలు తిప్పికొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పదివేల మందిని ఎన్కౌంటర్ చేసిందన్నారు. బిజెపికి ఎవరు వ్యతిరేకంగా మాట్లాడిన బుల్ డేజర్‌తో తెల్లవారేసరికి వారి ఇళ్లను బిజెపి ప్రభుత్వం కూల్చివేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపితో ముఖ్యమంత్రి కేసీఆర్ రాజీ పడ్డాడని, ఆ ఫలితంగానే బీఆర్ఎస్‌తో పొత్తు కుదరలేదు అన్నారు. కెసిఆర్ వామపక్షాలను మోసం చేశారని ఘాటుగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల కారణంగా ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తుకు చర్చలు జరుగుతున్నాయి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి, బీఆర్ఎస్ బహిరంగ ఒప్పందాలే చేసుకున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడించడానికి వామపక్షాలు ఐక్యంగా నిర్ణయాలు తీసుకున్నాయన్నారు. మునుగోడు ఉప ఎన్నికలలో కేసీఆర్ వాముపక్షాలను వినియోగించుకున్నాడని, ఆ తర్వాత జరిగే ఎన్నికలలోను కలిసి పని చేద్దామని వామపక్ష రాష్ట్ర నాయకులతో కెసిఆర్ అన్నారని ఆయన తెలిపారు. కాని అందుకు విరుద్ధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహరించడం వల్ల బీఆర్ఎస్‌కు వామపక్షాలు దూరం అయ్యాయి అన్నారు. కేంద్ర కమిటీ ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల పొత్తు ఉంటుందన్నారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా ఆ నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పోతినేని సిపిఎం నాయకులకు, శ్రేణులకు పిలుపునిచ్చారు. బిజెపి దేశవ్యాప్తంగా సిపిఎంపై రాజకీయ దాడులు, ఒత్తిడి పెంచిందన్నారు. త్రిపుర రాష్ట్రంలో సాక్షాత్తు మాజీ ముఖ్యమంత్రి మాణిక్య సర్కారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా కేంద్ర బలగాలతో ఒత్తిడి చేసింది అన్నారు. ప్రస్తుతం బెంగాల్ రాష్ట్రంలోనూ అదే పరిస్థితి కొనసాగుతుందన్నారు. ఎన్డీఏ కూటమి నుంచి అనేక పార్టీలు బయటకు వస్తున్నాయన్నారు. ఇండియా కూటమి బిజెపిని ఓడించడానికి ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు శాఖా కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు ప్రజాసంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతాపనేని' ఆశయ సాధన కోసం కృషి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ- రఘునాథపాలెం



కామంచికల్ గ్రామంలో సీపీఐ(ఎం) ఉద్యమ, అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి, అలాగే గ్రామంలో గ్రంథాలయాన్ని నిర్మించి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేసిన వ్యక్తి ప్రతాపనేని సత్యనారాయణ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సత్యనారాయణ ఏడో వర్ధంతి సభ కామంచికల్ గ్రామంలో వ్యకాస నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో నున్నా మాట్లాడుతూ 30 సంవత్సరాలు సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికై కామంచికల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కమ్యూనిజం సిద్ధాంతం సోషలిస్టు వ్యవస్థ మాత్రమే పరిష్కారమని నమ్మి జీవితాంతం కృషి చేసిన వ్యక్తి అని, ఆయన ఆశయ సాధన కోసం మనందరం ముందుకు సాగాలని అన్నారు. సభలో పార్టీ నాయకులు పొన్నం వెంకటేశ్వర రావు, బండి రమేష్, మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, ఎర్ర శ్రీనివాసరావు, నంద్ర ప్రసాద్, పొన్నగంటి సంగయ్య, పి.నాగేశ్వరరావు, వీరయ్య, మురళి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు. సభానంతరం వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ సంఘాలు నిర్వహించిన క్రికెట్, కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

నిబద్ధత కలిగిన మార్క్సిస్టు మిడిదొడ్ల సత్యం

నవతెలంగాణ-చింతకాని



నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి కడవరకు నిబద్ధత కలిగిన మార్క్సిస్టు నాయకుడిగా మిడిదొడ్ల సత్యం తన జీవితం గడిపారని సిపిఐ(ఎం) జిల్లా నాయకులు సామినేని రామారావు, పార్టీ మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు అన్నారు. పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు మిడిదొడ్ల సత్యం ప్రథమ వర్ధంతి బుధవారం రాత్రి పాతర్లపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా సామినేని రామారావు, మడిపల్లి గోపాలరావులు మాట్లాడుతూ సత్యం నిరాడంబర జీవితాన్ని గడిపి నేటితరం నాయకులకు ఆదర్శంగా నిలిచారని, పార్టీ కార్యకర్తలు సత్యం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. నివాళులర్పించిన వారి పార్టీ సీనియర్ నాయకులు కొండ్రు జానకిరామయ్య, శాఖ కార్యదర్శి కాటబత్తిని వీరబాబు, నెల్లూరు వెంకటేశ్వర్లు, పంగా గోపయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, టేకుమట్ల పుల్లయ్య, ఒల్లంకొండ సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి

నవతెలంగాణ - ఎర్రుపాలెం



కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీలు త్వరలో జరగనున్న శాసన సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజులలోనే అమలు పరుస్తారని పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకు వెళ్లి ఇంటింటికి ప్రచారం చేయాలని, కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని సూచించారు. తొలుత జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీనివాసరావు, వెంకట రామిరెడ్డి, అనుమోలు కృష్ణారావు, దేవరకొండ రాజీవ్ గాంధీ, షేక్ జానీ భాష, యన్నం పిచ్చిరెడ్డి, బుర్రా నారాయణ, దేవరకొండ శ్రీనివాసరావు, గూడెటి బాబురావు, వేజెండ్ల సాయి, పాముల లక్ష్మణ రావు పాల్గొన్నారు.

ఊపందుకున్న 'సండ్ర' ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-కల్లూరు



టిఆర్ఎస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గం అభ్యర్థి ప్రస్తుత ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యని గెలిపించాలని, నవంబర్ 1న జరిగే ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం పట్నం, గ్రామాలలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకు వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు లక్కినని రఘు, యువజన శాఖ మండల అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ కమ్లి, మండల సోషల్ మీడియా అధ్యక్షులు చిలంశెట్టి కిరణ్ కుమార్, సీనియర్ నాయకులు ఉప్పు నరసింహారావు, కోట యాకుబ్ ఖాన్, ఖమ్మం పాటి నాగేశ్వరరావు, సయ్యద్ ఇషాక్, సయ్యద్ రావుఫ్ లక్కినేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

నాగభూషణం నిబద్ధత కలిగిన ప్రజానాయకుడు

సంస్మరణ సభలో వక్తలు

నవతెలంగాణ -బోనకల్



మండల పరిధిలోని ముష్టికుంట గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు జక్కా నాగభూషణం నిబద్ధత కలిగిన ప్రజా నాయకుడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొనియాడారు. మండల పరిధిలోని ముష్టికుంట గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకులు జక్కా నాగభూషణం సంస్మరణ సభ సిపిఐ మండల కార్యదర్శి యంగళ ఆనందరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. తొలుత జక్కా నాగ భూషణం చిత్రపటానికి కూనంనేని సాంబశివ రావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, టిడిపి ఖమ్మం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, నాయకురాలు మందడపు రాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ నాగభూషణం నాగభూషణం జీవితాంతం నమ్మిన సిద్ధాంతాల కోసం క్రమశిక్షణతో, నీతి, నిజాయితీగా పనిచేసి ప్రజా హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాడు అన్నారు. డబ్బు రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ధైర్యంగా నిలబడిన నాయకుడు నాగభూషణం: సీపీఐ(ఎ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు

ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ధైర్యంగా నిలబడిన ప్రజానాయకుడు నాగభూషణం అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు కొనియాడారు. బోనకల్ మండలంలో జరిగిన అనేక ఎన్నికలలో తాను, నాగభూషణం కలిసి పని చేశామన్నారు. నాగభూషణం మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో పనిచేసేటప్పుడు బూర్జువా పార్టీల నుంచి అనేక దాడులు ఎదుర్కొన్నారన్నారు. ఎ కేంద్రంలో గల బిజెపి ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తుందని ఆయన ఘాటుగా విమర్శించారు. ఆర్థిక వ్యవస్థను కాపాడుకోకపోతే దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది అన్నారు. మానవ విలువలను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నాశనం చేస్తుందన్నారు. గుజరాత్ లో 8 మందిని హత్య చేసిన 18 మందికి కోర్టులు మరణశిక్ష విధిస్తే అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వారిని విడుదల చేసి పూలమాలలతో ఊరేగించారన్నారు. ఇంతటి నీచమైన బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పకపోతే భవిష్యత్తులో ఇటువంటివి మరలా పునరావృతం అవుతా యన్నారు.

కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, గీత పనివారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దోసరి శ్రీరాములు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల రామారావు, సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిఐటియు మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, గీత పారిశ్రామిక సహకార సొసైటీ చైర్మన్ దారగాని నాగేశ్వరరావు, సిపిఐ చింతకాని మండల కార్యదర్శి మల్లికార్జున్ రావు, బిజెపి జిల్లా నాయకులు బోళ్ల బిక్షపతి, టిడిపి నాయకులు బంధం రంగయ్య, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, నాగభూషణం కుమార్తె విశాలాంధ్ర తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

- **90 శాతం ఓటింగ్ నమోదు కావాలి**
- **జిల్లాలో రూ.20.30 కోట్లు సీజ్ విచారణ అనంతరం రిలీజ్ చేశాం**
- **విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.జీ**

నవతెలంగాణ-ఇల్లందు



త్వరలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.జీ కోరారు. పెట్రోల్ బంకు, పోలీస్ గెస్ట్ హౌస్ ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలలో 72, 80 శాతం ఓట్లు పోలయ్యాయని ఈసారి జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో 90 శాతం పోలింగ్ అయ్యేవిధంగా అన్ని వర్గాల వారు కృషి చేయాలన్నారు. పోలింగ్ రోజున ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినం ప్రకటించిందని తెలిపారు. రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ సరిహద్దులలో చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఏర్పాటైన దగ్గర నుంచి నేటి వరకు చెకింగ్ పాయింట్లలో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.20 కోట్ల 30 లక్షలు రికవరీ చేశామన్నారు. వీటికి సంబంధించిన రుజువులు చూపించడంతో రిలీజ్ చేశామన్నారు. ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు మించి డబ్బులు తరలిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. కలెక్టరేట్లో గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటయిందని విచారణ అనంతరం 24 గంటల్లో సీజ్ చేసిన డబ్బు ఇతర బంగారు వస్తువులు రిలీజ్ చేస్తామని చెప్పారు. పట్టుబడిందంతా ఎన్నికలకు సంబంధించిన నిధులు కావని అన్నారు. లా అండ్ ఆర్డర్‌ను అనుసరించి రాజకీయ పార్టీలు మసలుకోవాలన్నారు. మతపరమైన ఇతర ఉద్రేకాలకులోను కావద్దన్నారు. సోషల్ మీడియాలో పాత వీడియోలు, మార్ఫింగులు, తప్పుడు సమాచారాలు ఉంటే స్థానిక నోడల్ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు, ఇల్లందు డిఎస్పీ రమణమూర్తి, సిఐలు కరుణాకర్, రవీందర్, ఇంద్రసేనారెడ్డి, ఆర్ఐలు కామరాజు, కృష్ణారావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌కు అధికారులు శాలువా కప్పి మెమెంటుతో ఘనంగా సత్కరించారు.

'కోరం'కు టికెట్ ఇవ్వద్దు

పారాషుట్ హటావో.. కాంగ్రెస్ బచావో

నవతెలంగాణ-ఇల్లందు



దశాబ్దాలుగా పార్టీలో పని పనిచేస్తున్న వారికి టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ టికెట్ తో గెలిచి మోసం చేసి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి కాంగ్రెస్ టికెట్ కోసం వచ్చిన కోరం కనకయ్యకు టికెట్ ఇవ్వద్దని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఏకంగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న 32 మంది ఆశావాహులు ఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గంలో నుండి పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీలో కష్టపడి జెండా మోసిన నాయకులకి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని నినాదం చేశారు. అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీని ఇల్లందు నియోజకవర్గంలో నుండి గతంలో మోసం చేసిన నిన్న కాక మొన్న పార్టీలో వచ్చిన కోరం కనకయ్యను టికెట్ కేటాయించవద్దు, సేవ్ కాంగ్రెస్ సేవ్ ఇల్లందు పారాషుట్ హటావో ఇల్లందుకు బచావో అనే నినాదాలతో ఏఐసీసీ కార్యాలయం ముందు ఎమ్మెల్యే అభ్యర్థులు అందరూ కూడా ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా నేతలు భూక్యా దళ్ సింగ్ నాయక్, చీమల వేంకటేశ్వర్లు, కామేపల్లి జెడ్పీటీసీ వెంకట ప్రవీణ్, నాగేంద్ర నాయక్ ,విజయ లక్ష్మి ,శంకర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్ మాట్లాడారు. రేపు గురువారం మరో 200 మంది నాయకులు కార్యకర్తలు ఢిల్లీకి చేరుకోనున్నారని తెలిపారు. 2014, 2018లో రెండు విడతలు కోరం కనకయ్య హరిప్రియలకు అసెంబ్లీ టికెట్ అధిష్టానం ఇచ్చిందన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు ఎంతో కష్టపడి గెలిపిస్తే ముచ్చటగా మూడు నెలలు కూడా పార్టీలో ఉండకుండా బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ జాతీయ నేతలైన సోనియా,రాహుల్, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కార్యాలకు వివరించినట్లు తెలిపారు.



తపాలా శాఖ అందిస్తున్న పథకాలను ప్రచారం చేయండి

నవతెలంగాణ-చంద్రుగొండ

కేంద్ర ప్రభుత్వం తపాల శాఖ ద్వారా అందిస్తున్న పొదుపు పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి పథకాల్లో ప్రజలను భాగస్వాములుగా చేయాలని కొత్తగూడెం తపాల శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ చౌదరి బ్రాంచి పోస్టుమాష్టర్లను ఆదేశించారు. చంద్రుగొండలోని ఉప తపాల కార్యాలయంలో పోస్టుమాస్టర్ రఘు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన గ్రామీణ తపాల బీమా, రికరింగ్ డిపాజిట్ ఖాతాలు, సుకన్య సమద్ధి తదితర ఖాతాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. బ్రాంచి పోస్టుమాష్టరకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మెయిల్ వార్సిల్ సత్యనారాయణ, బ్రాంచి పోస్టుమాస్టర్లు రిజ్వగా, వాణి, గణేష్, రవితేజా, మటపర్తి వెంకటేశ్వరు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ ఆఫ్ భద్రాద్రి నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-భద్రాచలం రూరల్





ప్రెస్ క్లబ్ ఆఫ్ భద్రాద్రి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని భద్రాచలంలో బుధవారం ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ భద్రాద్రి కమిటీ అధ్యక్షులుగా రేపాక రామారావు, ప్రధాన కార్యదర్శిగా గుమ్మలూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కుంచాల సదానందం, కోశాధికారిగా బండారు శ్రీకాంత్ లతోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్తూ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వారధిగా నిలుస్తామని తెలియజేశారు. పాత్రికేయుల హక్కులు, సంక్షేమం కోసం పాటు పడతామని తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నవతెలంగాణ-బూర్గంపాడు

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బూర్గంపాడు ఎస్ఐ రాజ్ కుమార్ అన్నారు. బూర్గం పాడు మండల పరిదిలోని మర్రికుంట గ్రామానికి చెందిన యువతకు బుధవారం ఎస్ఐ వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనా లకు దూరంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్ఐ నాగభిక్షం పాల్గొన్నారు.

బతుకమ్మ ఊరేగింపులో ఘర్షణ

నవతెలంగాణ -బూర్గంపాడు

బూర్గంపాడు మండల పరిదిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వ హించిన బతుకమ్మ ఉరేగింపు కార్యక్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు ఇరువర్గాలకు చెందిన వారు కర్రలతో దాడికి పాల్పడడంతో గాయాలయినట్లు తెలుస్తోంది. ఇరువర్గాలకు చెందిన వారు పోలీసులకు పిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్ఐ రాజ్ కుమార్ విచారణ చేస్తున్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

నవతెలంగాణ-చంద్రుగొండ

సైబర్ నేరాలపై బుధవారం పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. చరవాణిల్లో వచ్చే ప్రతి మెసేజ్‌ని క్లిక్ చేయరాదని, ఆధార్ కార్డు నెంబర్, బ్యాంకు ఖాత నెంబర్, ఓటీపీ నెంబర్లు ఎవరికి చెప్పరాదని వారు ప్రజలకు తెలియజేశారు. అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేసి బ్యాంకు ఖాతాల సమాచారం అడుగుతారని ఎవరు తొందరపడి సమాచారం ఇవ్వొదు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు వెంకటేశ్వరు, క్రిష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ములకలపల్లి

మిత్రుని కుటుంబానికి బాల్యమిత్రులు ఆర్థికసాయం చేసిన సంఘటన మండల పరిధిలోని మాదారంలో బుధవారం చోటుచేసుకుంది. మాధారం గ్రామానికి చెందిన కందుకూరి బాబూరావు కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ ఈనెల 19న మతిచెందాడు. 1997లో 10వ తరగతి చదువుకున్న బాల్యమిత్రులు ఈ విషయం తెలుసుకుని బాబూరావు కుటుంబానికి రూ.19వేలు ఆర్థికసాయం అందించి తమ స్నేహాన్ని చాటుకున్నారు. ఈ నగదును బాల్యమిత్రులు ఈర్ల రామ్మోహనరావు, కీసరి రాములు, వెంకటరమణ, కనుకుంట్ల వెంకటరమణ ఆధ్వర్యంలో భార్య లలిత, కుమారుడు సందీప్, కుమార్తె సాధనలకు అందించారు. సహాయం చేసిన వారిలో నరుకుళ్ల రవిబాబు, శెనగపాటి ప్రసాద్, కవిత, ఈర్ల రామ్మోహనరావు, వెంకటరమణ, రాములు, సంధ్య, నాగమణి, సుమన్, అశోక్ రెడ్డిలు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | అక్టోబర్ 26, 2023 | www.navatelangana.com

ఎన్ లక్ష్మీపురం, సింగవరం గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మించాలి

- **వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు**

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని ఎన్ లక్ష్మీపురం, సింగవరం గ్రామాల మధ్య నిర్మించిన సఫ్టా కొట్టుకు పోవడంతో పై రెండు గ్రామాలకు రాక పోకలకు గిరిజన గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం వ్యవశాయ కార్మిక సంఘం ఆద్వర్యంలో వరదలకు కొట్టుకు పోయిన చఫ్టాను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరదలతో మూడు సంవత్సరాల క్రితం సఫ్టా కొట్టుకు పోయిందని దీంతో రెండు గ్రామాల ప్రజలు పంట పొలాలకు వెళ్లాలన్నా.. ఇతరత్రా పనులకు వెళ్లాలి అన్నా వాగు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందన్నారు. వాగు దాటే క్రమంలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ ఎమ్మెల్యే పొదెం వీరయ్య నేటికి అటు వైపు కన్నెత్తి చూడలేదన్నారు. రెండు గిరిజన గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఐటిడీఏ అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాలని, లేక పోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు మండలం సూరారం గ్రామానికి చెందిన బోడా హనుమ కుమారుడు సోమ్లా (70) గత కొంతకాలంగా మానసిక వేదనతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలుమార్లు హాస్పిటల్ చూపించిన తగ్గలేదు. ఈ క్రమంలో తనకున్న మానసిక సమస్య గురించి తీవ్ర మనోవేదనకు గురై జూలూరుపాడుకు వెళ్ళొస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి జూలూరుపాడు వచ్చి ఎమ్మార్వో ఆఫీస్‌కు సమీపంలో ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా అటుగా వెళు తున్న సూరారం గ్రామస్తులు గమనించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా హుటా హుటిన వారంతా సంఘటన స్థలం వద్దకు వచ్చి కొన ఊపిరితో కొట్టిమిట్లాడుతున్న సోమ్లాను జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లి చికిత్స చేయిస్తుండగా చికిత్స పొందుతూ బుధవారం మతిచెందాడు. తన తండ్రి మృతిపై తనకు ఎలాంటి అనుమానం లేదని తన తండ్రి తనకున్న మానసిక సమస్యల వల్లనే కలత చెంది మరణించిన నాడని మృతుడి కుమారుడు బోడా శ్రీనివాస్, సూరారం గ్రామం ఫిర్యాదు ఇవ్వగా జూలూరుపాడు ఎస్సై పురుషోత్తం కేసు నమోదు చేశారు.

విజయమే లక్ష్యంగా కాంగ్రెస్

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం నియోజకవర్గంలో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీలోని 6 వ వార్డు, 7 వ వార్డులో గడప గడపకు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఊకంటి గోపాల్‌రావు, తూము చౌదరి, ఆళ్ల మురళి, నాగేందర్ త్రివేది మాట్లాడుతూ..... రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ 6 గ్యారెంటీ పథకాలను అమలు చేయడం జరుగుతుందని చెబుతూ గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం చెపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెక్రటరీ గౌస్ భాయ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఖలీల్, సత్యనారాయణ రెడ్డి, కనకరాజు, సుందర్ లాల్ కోరి, వనమా రాము, నాగేశ్వరరావు, వెంకటేష్, రాము, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

24 గంటలు వైద్య సేవలు అందిస్తాం

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్

నవతెలంగాణ-సుజాతనగర్

మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా చూస్తామని బహుజన్ సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, అడ్వకేట్ యెర్రా కామేష్ అన్నారు. బుధవారం మన కొత్తగూడెం-మన కామేష్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రాఘవాపురం, మాల బంజర, గొల్లగూడెం తదితర గ్రామాలలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ మండలంలో సాయంత్రం నాలుగు దాటితే ప్రభుత్వ వైద్యం అందడం లేదని రాత్రి సమయాలలో అత్యవసరంగా వైద్యం అవసరం వస్తే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే 24 గంటలు వైద్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు మార్పును కోరుకుని తన ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆదినారాయణ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | అక్టోబర్ 26, 2023 | www.navatelangana.com

కార్మికుల మేనిఫెస్టో అమలు చేసే వారికే ఓటు

• సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్

నవతెలంగాణ-ఇల్లందు

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యింది మొదలు మాకు ఓటు వేయండి అంటూ అనేక పార్టీలు ఓట్ల కోసం వస్తున్నారు... కార్మికులకు కనీస వేతనాలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీం వర్కర్స్‌ను పర్మినెంట్ చేస్తాము, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని కార్మికులకు సంబందించిన మేనిఫెస్టో ఎవరైతే విడుదల చేసి, అమలు చేస్తామని ప్రకటిస్తారో ఆ పార్టీలకే ఓటు వేస్తామని సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే. రమేష్ తెలిపారు. బుధవారం ఈసం వెంకటమ్మ



అధ్యక్షతన నిర్వహించిన సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత రాష్ట్ర ప్రభుత్వం కార్మికులతో పనులు చేయిస్తూ వారికి కనీస వేతనాలు ఇవ్వకుండా సమ్మెలు కూడ చేయకుండా తీవ్ర నిర్బంధం ప్రయోగించిందన్నారు. సమస్యలు పరిష్కరించాలని కార్యక్రమాలు చేస్తే ప్రభుత్వం కన్నెర్రజేసిందని విమర్శించారు. తెల్లవారుజామునే కార్మిక నేతలను అరెస్టు చేయించి పోలీస్ స్టేషన్లో ఉంచారన్నారు. దశాబ్దకాలంగా నిత్యావసర వస్తువులు, పండ్లు, కూరగాయలు, బట్టలు ఇతర అన్ని రకాల వస్తువులు విపరీతంగా పెరిగాయన్నారు. పేదలు ఇండ్లు కట్టుకోవడమేమో కానీ కనీసం స్థలాలు కూడా కొనుక్కునే పరిస్థితి లేకుండా ధరలు చుక్కలు చూపిస్తున్నాయని చెప్పారు. కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ కూడా కనీసం అమలు చేయలేని స్థితి ఉందన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే పార్టీలకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ, మరియ, ఫాతిమా, కుమారి, శ్రీవల్లి, శారద, సుభద్ర, పార్వతి, సువార్త, దీప్తి, సుశీల, అరుణ, శ్రీనివాస్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్, అతిథి గృహాన్ని ప్రారంభించిన ఎస్పీ

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని బుగ్గవాగు సమీపంలో బుధవారం పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్, గెస్ట్ హౌస్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీస్ వెల్ఫేర్ బంకు జిల్లాలో పాల్వంచ తర్వాత ఇల్లందు రెండవ పెట్రోల్ బంక్ అని తెలిపారు. ప్రజలకు నాణ్యతతో కూడిన ఇంధనాన్ని అందించేందుకుగాను జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ మరణించిన పోలీసుల కుటుంబాలలో ఆర్థికంగా వెనుకబడిన వారి కుటుంబ సభ్యులకు ఈ బంకులలో జీవనోపాధిని కల్పిస్తున్నామన్నారు. ప్రజలందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



అదేవిధంగా వివిధ రకాల బందోబస్త్ లకు ఇల్లందు పట్టణానికి వేరే ప్రాంతాల నుంచి వచ్చే పోలీసుల కోసం ఏర్పాటు చేసిన అతిథి గృహాన్ని ప్రాంభించారు. పోలీస్ అధికారులు మరియు సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లప్పుడు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, ఇల్లందు డిఎస్పీ రమణమూర్తి, సిఐలు కరుణాకర్, రవీందర్, ఇంద్రసేనారెడ్డి, ఆర్ఐలు కామరాజు, కృష్ణారావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలి

నవతెలంగాణ-పినపాక

మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించిన తర్వాతే డంపింగ్ షెడ్లకు తరలించాలని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు సెక్రటరీలను ఆదేశించారు. బుధవారం మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో పర్యటించి పనులను తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తను కలిపి తరలించడం సరికాదని తెలిపారు. చెత్తను వేరు చేసి అందించేలా ఆయా ఇంటి యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామపంచాయతీలలో స్వచ్ఛతకు ప్రతి ఒకరూ కృషి చేయాలని కోరారు. మండల వ్యాప్తంగా 100 శాతం వేర్వేరుగా చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.



కార్మికురాలని పరామర్శ : సీఐటీయూ

నవతెలంగాణ-భద్రాచలంరూరల్

ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాశర్ధ్య కార్మికురాలు గీతాను సీఐటీయూ భద్రాచలం పట్టణ కమిటీ సభ్యురాలు, సీఐటీయూ పట్టణ కమిటీ బృందం బుధవారం పరామర్శించింది. అనారోగ్యంతో బాధపడుతున్న గీతాకు మెరుగైన వైద్యం కోసం ఊపిరితిత్తుల సంబంధిత డాక్టర్ బాబురావుతో సీఐటీయూ సీనియర్ నాయకులు జీఎస్ .శంకర్‌రావు చరవాణి ద్వారా మాట్లాడి ఆమెకి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం జిఎస్.శంకర్‌రావు గీతా కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కార్మిక సంఘలో పనిచేస్తున్న కార్మికులకు ఏ సమస్య వచ్చినా సీఐటీయూ నాయకత్వం అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా వారికి భరోసా కల్పించారు. గీత త్వరగా కోలుకొని తన పూర్వస్థితికి రావాలని ఆయన ఆకాంక్షించారు. గీతాను పరాశించిన వారిలో సీఐటీయూ పట్టణ కో కన్వీనర్ మర్లపాటి రేణుక, పట్టణ కోర్ కమిటీ సభ్యులు లక్ష్మణ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి సిరంజీలు అందజేత

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సిరంజీల కొరత కారణంగా వచ్చే రోగుల అవసరాన్ని గుర్తించి ఆళ్ళపల్లి, మర్కోడు గ్రామ పంచాయతీల కార్యదర్శులు రాసమళ్ల ప్రవీణ్‌కుమార్, తాటి నాగరాజు స్థానిక ఎంపీఓ బి.శ్రీనివాసరావు చేతుల మీదుగా 14 సిరంజీ డబ్బాలు వైద్యాధికారి అర్వపల్లి రేవంత్‌కు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్కోడు సర్పంచ్ శంకర్ బాబు, ఈశ్వర్ వెంకటేష్, అన్వేష్, జీవన్, ఫార్మసిస్ట్ వి.విజయ, తదితరులు పాల్గొన్నారు.

మనస్థాపంతో యువకుడు బలవన్మరణం

• నానాటికీ పెరుగుతున్న బలవన్మరణాల సంఖ్య

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



కుటుంబ సభ్యులు మందలించారని యువకుడు మనస్థాపంతో క్రిమి సంహారక (మోనో) మందు తాగి బలవన్మరణం పొందిన ఘటన ఆళ్ళపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరం గ్రామానికి చెందిన మొగిలిపల్లి శేఖర్ (21)ను మంగళవారం ఉదయం ఇంటి పనులు పట్టించుకోకుండా తిరుగుతున్నావని తండ్రి వెంకటేశ్వర్లు మందలించడంతో చేను కాడికి పోతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. చేను వద్ద ఉన్న తాటి చెట్ల దగ్గర మనస్థాపం చెందిన శేఖర్ పురుగుల మందు తాగుతూ వీడియో తీసి, తోటి మిత్రులకు సమాచారం అందజేశాడు. దాంతో హుటాహుటీన మిత్రులు, కుటుంబ సభ్యులు ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి శేఖర్ ను ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకుని వెళ్ళమని వైద్య సిబ్బంది కుటుంబ సభ్యులకు సూచించారు. దాంతో ఓ టాటా మ్యాజిక్ లో కొత్తగూడెం తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శేఖర్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దాంతో చేతికి అందిన కొడుకు మృతి చెందాడని తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, సాంబరాజ్యం కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇదిలా ఉంటే సోమవారం పండుగ రోజున మండల పరిధిలోని పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన పడిగ శంకర్ అనే యువకుడు సైతం పురుగుల మందు తాగి బలవన్మరణానికి యత్నించాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించి ఇంటికి తీసుకొచ్చారు. ప్రస్తుతం శంకర్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మర్కోడు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన సంతోష్ అనే యువకుడు మద్యం మత్తులో పురుగుల మందు తాగినానని కుటుంబ సభ్యులకు చెప్పడంతో.. వారు ఎందుకైనా మంచిదని ఓ ఆటోలో మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు. రెండు నెలల కాల వ్యవధిలో మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో క్షణికావేశంలో యువతనే ఎక్కువగా బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు కోకొల్లలు. సంబంధిత అధికారులు ఆత్మహత్యల నివారణకు సరైన చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపడితేగాని మండలంలో బలవన్మారణాలు కొంత తగ్గుముఖం పట్టే అవకాశం లేదని పలువురు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

'80 ఏండ్లు దాటితే.. ఇంటి నుంచే ఓటు'

నవతెలంగాణ-పినపాక

వచ్చే నెల 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులు, 80 ఏండ్ల పైబడిన వద్ధులు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కేంద్ర ఎన్నికల సంఘం కల్పిస్తున్నదని ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ వీర భద్ర ప్రసాద్ తెలియజేశారు. వారు తాసిల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానం విజయవంతం కావడంతో రాష్ట్రంలోనూ అమలుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టిందన్నారు. ఈ నెల 4న ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం పినపాక మండలంలో 25,703 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 12,547, మహిళలు 13,156 ఉన్నారన్నారు. వికలాంగులకు సైతం పోలింగ్ కేంద్రాలలో వీల్ చైర్స్ ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికోసం ఇంటి వద్దనే తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టామని, గ్రామాల వారీగా అధికారులు వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు.

ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-పినపాక

పినపాక, కరకగూడెం మండలాల ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన మండల కమిటీని బుధవారం మండల పరిధిలోని రాళ్ళవాగు పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఎన్నుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కీసర సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికలలో నూతన మండల అధ్యక్షులుగా కరకగూడెం మండలానికి చెందిన సిరిసెట్టి కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా వాగబోయిన సాంబశివరావు, కోశాధికారిగా గాందర్ల సతీష్ ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల నర్సింహారావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద ఫోటో గ్రాఫర్స్‌ని ఆదుకోవాలని కోరారు. ఫోటో గ్రాఫర్స్ అందరూ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుటుంబ భరోసా పథకంలో చేరి ఫోటో గ్రాఫర్స్ కుటుంబాలకు అండగా ఉండాలని కోరారు. నూతన కమిటీ సభ్యులు అసోసియేషన్ బలోపేతానికి కషి చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మారుతీ ప్రకాష్, జిల్లా కన్వీనర్ పంపన రమేష్, కోశాధికారి బల్లెం అనిల్, రాష్ట్ర నాయకులు గణగంటి సారయ్య, రాయ నారాయణరెడ్డి, పుసులూరి శ్రీను, మామాడి జేమ్స్, గుండు వెంకటనారాయణ, పినపాక, కరకగూడెం మండలాల ఫొటో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-పినపాక



పినపాక మండలం రావి గూడెం ఎస్సీ కాలనీకి చెందిన చిట్టిమల్ల సురేష్ రెండు రోజుల క్రితం బతుకమ్మ నిమజ్జనం కోసం వెళ్లి గోదావరిలో గల్లంతయిన విషయం తెలిసిందే. రెండు రోజులుగా పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం సురేష్ మృతదేహం అశ్వాపురం మండలంలోని పాములపల్లి గోదావరి ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. మృతదేహాన్ని గుర్తించిన జాలరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బోటు సాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-పినపాక



పినపాక మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2004 - 2005 పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం బుధవారం కరకగూడెం మండలం రాళ్లవాగు వద్ద ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారికి విద్యాభ్యాసం నేర్పిన ఉపాధ్యాయులు ఎర్ర ప్రగడ రామ్మూర్తి, భూపతి హనుమంతరావులను సాధరంగా ఆహ్వానించి శాలువా, పూల బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడారు. మధుర స్మృతలను.. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని సమ్మేళనానికి వచ్చిన విద్యార్థులందరిని ఆశీర్వదించారు. తరువాత పూర్వ విద్యార్థులు వారి వారి విద్యాభ్యాసం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా ఆటపాటలతో సంతోషంగా సమ్మేళనాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో 1994-95లో స్కూల్ గుండు నరసింహమూర్తి స్నేహితుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన సత్యం, శ్రీను, కిషోర్, కొరసవెంకటేశ్వర్లు, నిర్మల, రిజువాన, సరస్వతి, స్వప్న, రమాదేవి, నాగార్జున, మధు, సంతోష్, పుష్ప, శారదా, రమణ, భారతి తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.12 లక్షలు పట్టివేత

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన సంజయ్ కుమార్ బుధవారం తన కారులో అశ్వారావుపేట మీదుగా కుక్కునూరు వెళుతున్నాడు. స్థానిక అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎస్సై శ్రీకాంత్ సంజయ్ కుమార్ కారులో రూ.1,12,500 నగదును గుర్తించారు. నగదుకు ఎటువంటి అధారాలు చూపక పోవటంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | అక్టోబర్ 26, 2023 | www.navatelangana.com

శాసనసభ్యుడిగా ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్

- మధిరను స్వర్ణయుగం చేస్తా
- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్ రాజు

నవతెలంగాణ-మధిర

ఆంధ్రప్రదేశ్ శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం మధిర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్ రాజు తన పుట్టినరోజు సందర్భంగా, ఎమ్మెల్యేగా విజయం చేకూరాలని తన ప్రచార రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధిర మండల పరిధిలోని రామచంద్రా పురంలో ఎన్నికల ప్రచార ర్యాలీ ప్రారంభించి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాకిచ్చిన జిల్లా పరిషత్ ఛైర్మెన్ అవకాశంతో మధిరను అభివృద్ధి చేశానని చెప్పారు. ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే మధిర అభివృద్ధిని ముందుకు నడిపిస్తానని చెప్పారు. మధిర ఇంతకు ముందు శాసన సభ్యులు బోడెపూడి వెంకటేశ్వరరావు, శీలం సిద్దారెడ్డి, కట్టా వెంకట నర్సయ్య, కొండబాల కోటేశ్వరరావు లాంటి మహానుభావులను ఆదర్శంగా తీసుకొని మధిరను అభివృద్ధి చేస్తానని చెప్పారు. దళితదొరలను శాసన సభ్యులుగా ఎన్నుకుంటే సామాన్యులను పట్టించుకోరని, నన్ను గెలిపిస్తే సామాన్యులకు అందుబాటులో ఉంటూ మధిర నియోజకవర్గం



అభివృద్ధికి పాటుపడ్తానన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండని కోరారు. అనంతరం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇచ్చి లింగాల కమల్ రాజుని ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మధిర మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పట్టని రాజకీయ పార్టీలు

సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విటల్

నవతెలంగాణ-వేంసూరు



రాజకీయ పార్టీలు కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం ఆ పార్టీలకు కార్మికులపై ఉన్న ప్రేమకు నిదర్శనమని సీఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విటల్ రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మర్లపాడులో హమాలీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పట్టని నాయకులకు ఓట్లతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈనెల 28న పెనుబల్లి లో జరగనున్న నియోజవర్గ స్థాయి సమావేశంకు సీఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పాల్గొనున్నారని చెప్పారు. ఈ సమావేశాన్ని అన్ని కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షులు తుంగ శేషయ్య, వరస అప్పారావు, కొప్పుల బాలకృష్ణ తోపాటు హమాలీ కార్మికులు ఉన్నారు.

ముత్తగూడెం చెక్పోస్టు వద్ద నగదు స్వాధీనం

నవతెలంగాణ-పెనుబల్లి

పెనుబల్లి మండలంలోని ఆంధ్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ముత్తగూడెం చెక్ పోస్టు వద్ద బుధవారం కారు నుండి రెండు లక్షల రూపాయలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్ర ప్రాంతం నుండి సత్తుపల్లి కి వస్తున్న రాజనాల నాగమణి చెందిన కారులో రెండు లక్షల రూపాయలు నగదు స్వాధీనం చేసుకొని ఖమ్మం ట్రెజరీకి పంపినట్టు ఎస్సై సూరజ్ తెలిపారు. చెక్ పోస్ట్ తనిఖీలు మద్యం డబ్బులు తరచూ వెలువడుతున్నాయి. ఆంధ్ర సరిహద్దుకావడం వల్ల, తెలంగాణ చెక్పోస్టు ముత్తగూడలో ఉండటంతో కారులో ప్రయాణించే వాళ్ల దగ్గర నుండి వారి సొంత పనుల మీద డబ్బులు తీసుకు వెళుతున్న సరైన పత్రాలు చూపలేకపోవడం వల్ల పట్టు బడటంతో వాహనదారులు లబోదిబో మంటున్నారు. అవసరాలు గుర్తించి తనిఖీల్లో సడలింపు ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.



పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత

ఎస్పీ డాక్టర్ వినీత్.జీ

నవతెలంగాణ-కొత్తగూడెం

పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.జీ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ (ఫ్లాగ్ డే) కార్యక్రమాలలో భాగంగా అక్టోబర్ 21 నుండి 30వ తేదీ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా బుధవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్పీ డాక్టర్ వినీత్.జీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్క్ నుండి ప్రారంభమై ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద యూ-టర్న్ తీసుకుని రైల్వే స్టేషన్, బస్టాండ్, పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి విద్యానగర్ కాలనీ బైపాస్ వద్ద యూ-టర్న్ తీసుకుని మరలా పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి సింగరేణి హెడ్ ఆఫీస్, గోధుమ వాగు బ్రిడ్జి మీదుగా రామవరం, 2 టౌన్ పోలీస్ స్టేషన్ నుండి రుద్రంపూర్ పార్క్ వరకు సాగింది. ఈ సైకిల్ ర్యాలీలో సుమారుగా 150 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీ ముగిసిన అనంతరం ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పోలీస్ అమరవీరుల స్మారక మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ఎంతో మంది పోలీస్ అమరవీరుల త్యాగాల ఫలితంగానే ఈరోజు మనం స్వేచ్ఛా వాయువులను పీల్చగలుగుతున్నామన్నారు. వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక వ్యాయామం చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు. ఉత్సాహంగా ఈ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయిమనోహర్, ఏఎస్పీ భద్రాచలం పరితోష్ పంకజ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు, సీఆర్పీఎఫ్ అధికారులు రితేష్ ఠాకూర్, సెంథిల్ కుమార్, కమల్ వీర్ యాదవ్, రజిత, సందీప్ రెడ్డి, 6వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ అంజయ్య, డీఎస్పీలు రెహమాన్, వెంకటేష్, రాఘవేంద్రరావు, రమణ మూర్తి, మల్లయ్య స్వామి, సీతారామ్, సిఐలు, ఎస్సైలు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నామ పీఏకి పితృ వియోగం

నవతెలంగాణ-కల్లూరు

ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు పిఏ నాగరాజు తండ్రి మాజీ ఆర్మీ ఉద్యోగి గోపాలం వీరస్వామి బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలియగానే ఎంపీ క్యాంప్ కార్యాలయం ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ నేతృత్వంలో క్యాంప్ కార్యాలయం సిబ్బంది, శ్రేయోభిలాషులు కల్లూరు వీరస్వామి భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి, సంతాపం తెలిపి, నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కార్యాలయం ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ, జిల్లా టెలికాం సలహా మండలి సభ్యులు చిత్తారు సింహాద్రి యాదవ్, వోలోజు సుధాకరాచారి, తన్నీరు రవి, వాకదాని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'రిటైర్డ్ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వీడాలి'

నవతెలంగాణ-మణుగూరు

సిరుల తల్లి సింగరేణిని రేయనక పగలనక లాభాల బాటలో నిలిపేందుకు అహర్నిశలు శ్రమించిన తమను ఉద్యోగం నుంచి పదవీ విరమణ పొందిన తర్వాత పట్టించుకోకపోవడం సరికాదని మణుగూరు సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లాభాల వాటా, ఏరియర్స్ తో పాటు దీపావళి బోనస్ డిక్లరేషన్లో జాప్యం చేస్తూ తమతో పని అయిపోయిందన్నట్లు వ్యవహరిస్తోందని రిటైర్డ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అంబేద్కర్ సెంటర్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దాదాపు 2వేల కోట్లకు పైగా లాభాల్లో ఉన్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాట, దీపావళి బోనస్ 2022 మార్చి నుంచి 2023 మార్చి వరకు రావాల్సినవి చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. 2021 జులైలో 10వ వేజ్ బోర్డు ఏరియర్స్ దిగిపోయిన కార్మికులకు నేటి వరకూ చెల్లించకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. లాభాల్లో ఉన్న సింగరేణి యాజమాన్యం రిటైర్డ్ కార్మికుల విషయంలో తీవ్ర నష్టాల్లో ఉన్నట్లు వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ భాగస్వామ్యంతోనే కావాలనే యాజమాన్యం రిటైర్డ్ కార్మికులను పట్టించుకోవడం లేదని దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సామా శ్రీనివాసరెడ్డి, నామా వెంకటేశ్వరరావు, బైరి శ్రీనివాస్, శివరావు, ఎండి .ఇమాముద్దీన్, శేఖర్, తిరుపతిరెడ్డి, రామయ్య, దేవుడు తదితరులు ఉన్నారు.

మధిర పాలిటెక్నికల్ కాలేజీకి చేరిన ఈవీఎం సామగ్రి

నవతెలంగాణ-మధిర

నవంబర్ 30న జరిగే ఎలక్షన్స్ కోసం ఎన్నికల యంత్రాంగం సర్వం సిద్ధమైంది. దానిలో భాగంగా బుధవారం నియోజకవర్గ ఎలక్షన్ సంబంధిత ఈవీఎంలను పట్టణంలోని ఖాజీపురంలోని పాలిటెక్నిక్ కళాశాలకు భారీ బందోబస్తు నడుమ అధికారులు, రాజకీయ నాయకుల సమక్షంలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో మధిర రూరల్ ఎస్సై ఎండి రఫీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న స్నేహితులు

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన మేడం లక్ష్మిరెడ్డి, ఆవుల రవీంద్రారెడ్డి ఇద్దరు స్నేహితులు బుధవారం అదే గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ మైన పులి ప్రవల్లిని అనే బాలికకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుల నిమిత్తం రూ.25 వేల ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. గత ఏడు సంవత్సరాల క్రితం తల్లిదండ్రులను కోల్పోయిన ప్రవల్లిని చదువుల్లో రాణించేందుకు అండగా నిలబడేందుకు ఇంటర్ నుండి ప్రతి సంవత్సరం ఇద్దరు స్నేహితులే వారి చదువులకు ఆర్థిక సాయం అందిస్తారు. ఈ క్రమంలో బుధవారం ఆర్థిక అందించి మానవత్వం చాటు కున్నారు. వారి ఇద్దరు స్నేహి తుల ప్రోత్సా హంతో ఇంటర్ మొదటి సంవత్సరం 461/470 మార్కు లు సాధించి కాలేజీ టాపర్ గా నిలిచింది. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరంకూడా మంచిగా రాణించి స్టేట్ ర్యాంక్ రావాలని ఆశా భావం వ్యక్తం చేశారు.

కోదండ రామాలయానికి శ్రీరామ రథం బహూకరణ

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలోని కోదండ రామాలయానికి శ్రీరామ రథాన్ని స్థానికులు చిట్యాల శ్రీనివాసాచారి సావిత్రి దంపతులు బహూకరించారు. రాముని పై భక్తితో మూడు లక్షల రూపాయల విలువైన టేకు కలపతో స్వహస్తాలతో గత రెండు నెలలుగా భక్తితో చేసిన శ్రీరామరథాన్ని దేవాలయానికి బహూకరించారు. దాతలను దేవాలయ కమిటీ వారు పట్టు వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. శ్రీరామ రథాన్ని పురవీధులలో ఊరేగించారు.

ముగిసిన దేవీ శరన్నవరాత్రులు

వైభవంగా అమ్మవార్ల నిమజ్జన శోభాయాత్ర

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలోని మండపాలతో పాటు ఆలయాల వద్ద నిర్వహించిన దేవీ శరన్నవరాత్రులు బుధవారంతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు కనకదుర్గమ్మ అమ్మవారుతో పాటు నడికుడి గ్రామంలో గల మహంకాళీ చాముండేశ్వరీ దేవి అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గ అమ్మవారి నిమజ్జన శోభాయాత్రను మండలంలోని సీతానగరం, చిన్నబండిరేవు, చిన్ననల్లబల్లి, లక్ష్మీనగరంతో పాటు పలు గ్రామాలలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ శోభా యాత్రలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సీబీఐ విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-బూర్గంపాడు

కాళేశ్వరం మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ డ్యామేజి ప్రభుత్వ అవినీతికి నిదర్శనమని, సీబిఐ విచారణ చేపట్టాలని బిఎస్పి జిల్లా ఉపాధ్యక్షుడు కెవి రమణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని బహిర్గతమైందని ఆయన అన్నారు. లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి, లక్ష ఇరవై వేల కోట్ల రూపాయలతో నిర్మించిన కాళే శ్వరం ప్రాజెక్టు లో కేసీఆర్ కుటుంబం కమీషన్ల ఫలితమేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి సీనియర్ నాయకులు నారపోగు శ్రీనివాస రావు, మండల అధ్యక్షుడు పాయం సింగరాజు పాల్గొన్నారు.

ఉమ్మడి మండలాల ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సిరిసెట్టి కమలాకర్

నవతెలంగాణ-కరకగూడెం

పినపాక, కరకగూడెం ఉమ్మడి మండలాల ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన మండల కమిటీనీ బుధవారం కరకగూడెం మండల పరిధిలోని రాళ్లవాగు పెద్దమ్మతల్లి ఆలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కీసర సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి మండల నూతన అధ్యక్షులుగా కరకగూడెం మండల కేంద్రానికి చెందిన సిరిసెట్టి కమలాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వాగబోయిన సాంబశివరావు, కోశాధికారిగా గాంధర్ల సతీష్‌ని నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల నర్సింహారావు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మారుతీ ప్రకాష్, జిల్లా కన్వీనర్ రమేష్, కోశాధికారి బల్లెం అనిల్, రాష్ట్ర నాయకులు గణగంటి సారయ్య,రాయ నారాయణరెడ్డి, పుసులూరి శ్రీను, మామాడి జేమ్స్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | అక్టోబర్ 26, 2023 | www.navatelangana.com

యాభై యేండ్లలో ఏమీ లేదు.. ఇప్పుడు ఉద్ధరిస్తారట

- కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రజలకు అనుమానాలు
- కర్నాటక ఎన్నికల హామీలు అటకెక్కించారు
- సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య
- సత్తుపల్లిలో ఇంటింటికీ బీఆర్ఎస్ మేనిఫెస్టో



నవతెలంగాణ-సత్తుపల్లి

స్వాతంత్ర్యం వచ్చాక కాంగ్రెస్ పార్టీకి ప్రజలు 50యేండ్లకు పైగా అధికారమిచ్చినా ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదని, అవినీతి, అరాచకాలతోనే వారి పాలన సాగిందని, ఇప్పుడు ఎన్నికలొచ్చేసరికి ప్రజలను ఉద్ధరిస్తామంటూ గ్యారంటీలేని ఆరు హామీలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని సత్తుపల్లి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రతులను పంచుతూ, ప్రజలతో మాట్లాడుతూ సండ్ర ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పాలనలో పింఛన్ రూ. 200 మించి పెంచలేకపోయారన్నారు. పేదింటి ఆడపిల్లల పెండ్లిండ్లకు సాయం అందించాలనే ఆలోచన వాళ్ల ఎందుకు రాలేదన్నారు. తెలంగాణ వచ్చి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకే సంక్షేమాభి వృద్ధి కార్యక్రమాలు ఉరుకులు పెడుతున్నా యన్నారు. సమాజంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఆత్మగౌరవిస్తూ ఆయా వర్గాలకు అనేక సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. ఇటీవల కేసీఆర్ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోకు ప్రజల నుంచి విపరీతమైన స్పందన వస్తోందన్నారు. రైతుబంధు సాయం ఎకరాకు రూ.16వేలు, దివ్యాంగులకు రూ. 6వేలు, ఆసరా పింఛన్లు రూ. 5వేలు చొప్పున అందించడం జరుగుతుందన్నారు. పేదలకు రూ.400లకే గ్యాస్‌బండ, సౌభాగ్యలక్ష్మీ పథకం ద్వారా పేదింటి మహిళలకు నెలకు రూ. 3వేలు, వచ్చే సంక్రాంతి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కొత్తూరు ఉమా మహేశ్వరరావు, మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, ఆత్మ ఛైర్మెన్ వనమా శ్రీనివాసుదేవరావు, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, గాదె నరసింహారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే రఫీ, మల్లూరు అంకమరాజు, యాగంటి శ్రీనివాస రావు, దొడ్డా శంకరరావు, వల్లభనేని పవన్, కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, ఎండీ అనీష అబ్దుల్లా, ఎస్కే చాంద్‌పాషా, అద్దంకి అనిల్ కుమార్, గుండ్ర రాఘవేంద్ర, దేవరపల్లి ప్రవీణ్ కుమార్, అమరవరపు విజయనిర్మల, నాయకులు నరుకుళ్ల శ్రీను, చిన్నంశెట్టి రాజ్యలక్ష్మీ, షర్మిళి కాశీం, వెంకటరెడ్డి, కోనేరు నాని పాల్గొన్నారు. వీరిశెట్టి సురేశ్‌కుమార్, పసుమర్తి కృష్ణారావు, సాయంత్రం ప్రధాన రహదారిపై ఉన్న దుకాణ యజమానులను కలుసుకుంటూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మేకల నరసింహారావు, జొన్నలగడ్డ శ్రీను, మరికంటి శ్రీను పాల్గొన్నారు.

ప్రజలను నిర్బంధిస్తే తగిన బుద్ధి చెబుతారు

- ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ - ఖమ్మంకార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 25వ డివిజన్ రిక్కాబజార్ సెంటర్‌లో ఖమ్మం పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన.నరసింహారావు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ..ప్రజలను భయపెట్టి, నిర్బంధాలు విధిస్తే భయపడిపోరని, అలాంటి వారికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రశ్నించిన వారి గొంతులను మంత్రి పువ్వాడ నొక్కే ప్రయత్నం చేస్తున్నట్లు పరోక్షంగా వ్యాఖ్యానించారు. ప్రజలకు ఏ అవసరం ఉన్నా నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం



పనిచేస్తానని తెలిపారు. గతంలో తాను చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి, ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మారగాని వెంకట్, పట్టణ నాయకులు ఎం.రఘు, గట్టు. నితీష్, జంగం భాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



'పాలేరు' అభివృద్ధే నా లక్ష్యం

- ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

పాలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా చేయలన్నదే తన లక్ష్యమని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తీర్థాల, మద్దివారిగూడెం, పొలిశెట్టిగూడెం గ్రామాలకు చెందిన పలు కుటుంబాల వారు బుధవారం బీఆర్ఎస్ చేరారు. పొలిశెట్టిగూడెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందాళ పార్టీ కండువాలు కప్పి వారిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పాలేరు నియోజవర్గానికి ఇప్పటికే ఫిషరీస్, నర్సింగ్ కళాశాలలతో పాటుగా జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. ప్రజలకు ఎపుడు ఏ అవసరం వచ్చినా వారికి అండగా ఉండి ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే నామినేషన్‌కు అయ్యే ఖర్చు రూ.10,116లను పొలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన పెంట్యాల కోటయ్య ఎమ్మెల్యేకు అందజేశారు. తాను ఎప్పుడూ ప్రజలకు ఇవ్వడమే కానీ వారి దగ్గర నుంచి ఎప్పుడూ తీసుకోలేదని, మొదటి సారిగా అభిమాని ఇచ్చిన నగదు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.

సామాజిక మాధ్యమాల్లో జాగ్రత్తగా ఉండాలి...

ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలో నాయుడుపేటలోని ఓ ఫంక్షన్‌లో బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో పాలేరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, చేసిన పనులను ప్రచారం చేయాలని, ఎవరినీ దూషించడం, వ్యక్తిగతంగా కించపరిచే విధంగా పోస్టులు పెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు యండపల్లి వరప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు గోపాల్, డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, పిఎసిఎస్ చైర్మన్ జర్పుల లక్ష్మణ్ నాయక్, సుడా డైరెక్టర్ గూడా సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌కి భారీ షాక్

- పొంగులేటి సమక్షంలో చేరిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ- ఖమ్మం

బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలంలోని కొక్కిరేణి ఎంపీటీసీ గుగ్గిళ్ళ అంబేద్కర్, మండల కోఆప్షన్ సభ్యుడు సైఫుద్దిన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు రాజేంద్ర ప్రసాద్, నగేష్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పొంగులేటి తన క్యాంప్ కార్యాలయంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా కూసుమంచి గ్రామ సర్పంచ్ చెన్న మోహన్, మాజీ సర్పంచ్ గుండా దామోదర రెడ్డి, అహ్మద్ అలీ, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మ రెడ్డి, ముదిరెడ్డి శ్రీనివాస రెడ్డి, సంఘ బత్తుల నాగిరెడ్డి తదితరులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మండల జడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, గండ్ర గోపాలరావు, మాజీ ఎంపీపీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలతో దళితులపై పెరుగుతున్న దాడులు

- సామాజిక న్యాయం సమాధి
- కోటి సంతకాలతో డిసెంబర్ 4న చలో ఢిల్లీ
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం



రాజ్యాంగం రిజర్వేషన్లు దళితుల సమగ్రాభి వృద్ధికై సామాజిక న్యాయ సాధనకై కోటి సంతకాలతో డిసెంబర్ 4న చలో ఢిల్లీకి తరలిరావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం ఎన్ఎస్‌పి క్యాంపు మంచికంటి ఫంక్షన్ హాల్‌లో కేవీపీఎస్, ఏఐఏడబ్ల్యూయూ, డిహెచ్‌పిఎస్ బికెఎంయూల సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేవీపీఎస్, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు నందిపాటి మనోహర్, మంద వెంకటేశ్వర్లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్య తర్వాత ఇంకా దళితులపై దాడులు జరగడం శోచనీయం అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి 300 రెట్లు దాడులు పెరిగాయన్నారు. దళితుల కోసం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు వారి దరిచేరలేదని అన్నారు. పౌరుల ప్రజాతంత్ర హక్కులపై ఉక్కు పాదం మోపుతుందన్నారు. రిజర్వేషన్లు సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నదనీ, భారత రాజ్యాంగ స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని ప్రవేశపెట్ట జూస్తుందన్నారు. జనాభా దామాషా ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో నిధులు కేటాయించి దళితుల అభివృద్ధికి ఖర్చుపెట్టాలన్నారు. ఎస్సి, ఎస్టి సబ్‌ప్లాన్ చట్టాన్ని దేశమంతటా అమలు చేయాలన్నారు. అట్రాసిటీ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర చేస్తు ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలు చేయకుండా తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు ఉపాధిని కల్పిస్తున్న ప్రైవేట్ రంగంలో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు అమలు చేయడం లేదన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డులు రద్దు చేసి ప్రజా పంపిణీ వ్యవస్థను తీసివేయాలని కుట్ర పన్నుతున్నారనీ, అభివృద్ధి పేరుతో అసైన్మెంట్ భూములను కిరాతకంగా లాక్కుంటున్నారనీ, అసైన్మెంట్ చట్టానికి తూట్లు పొడుస్తున్నారనీ, ఎస్సీ, ఎస్టీ భూముల అభివృద్ధితో పాటుగా 100 రోజుల పని కల్పన కోసం వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర పన్నుతున్నారనీ ఆయన విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నీరుకారుస్తున్నారనీ అన్నారు. బికెఎంయూ, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ దళిత గిరిజన మహిళల పైన దాడులు హత్యలు, అత్యాచారాలు విపరీతంగా పెరిగాయన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలపై అగ్రకుల పెత్తందారుల దాడులు దాడులు పెరుగుతున్నాయని అన్నారు ప్రజలంతా ఐక్యమై ప్రజా ఉద్యమాలను నిర్వహించాలని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, ఎర్ర శ్రీనివాసరావు తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మాచర్ల భారతి, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుంతెటి వీరభద్రం, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తమల ప్రసాద్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి దుగ్గి కష్ణ, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎండి గౌస్, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పగడాల నాగేశ్వరరావు, బివికే ట్రస్టు నాయకులు శ్రీమన్నారాయణ, పెన్షనర్స్ సంఘం నాయకులు కళ్యాణం నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎస్.నవీన్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు గాదె లక్ష్మీనారాయణ, మేకల శ్రీనివాసరావు, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు బొట్ల సాగర్, పాపిట్ల సత్యనారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు నందిగామ కష్ణ కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా నాయకులు పొన్నెకంటి సంగయ్య, రాధాకష్ణ, వడ్లమూడి నాగేశ్వరరావు, ఎస్కే సైదులు, జార్జి, నగేష్, ఉప్పలయ్య, బాలరాజ్, రామ్మూర్తి పాల్గొన్నారు